# ప్రేమపరీక్ష

-- కథ --



- మేరీ కృపాబాయి

"హలో సీతా! చందన కాలేజీకి రెండు రోజులుగా రావట్లేదే?" సీత వైపు చూస్తూ అన్నాడు మణీంద్ర

"అదేనాకూ తెలీలేదు. ఏదైనా ఊరువెళ్లిందేమో" అనుమానంగా అందిసీత

"కనీసం నాతో మాటమాత్రానికైనా చెప్పలేదు. రెండురోజులుగా ఎంతగా ఎదురుచూస్తున్నానో" అన్నాడు మణీంద్ర

"చందన ఎందుకు కాలేజీకి రావట్లేదో నేను తెలుసుకుంటాను" అందిసీత

"చాలా థ్యాంక్స్ సీతా!దయచేసి త్వరగా తెలుసుకో రేపేనాకు ఏ విషయమూ చెప్పాలి" అన్నాడు మణీంద్ర

- - -

మణీంద్ర, చందన ప్రేమికులనే విషయం కాలేజీలో అందరికీతెలుసు కాలేజీ గోడలకు, బ్లాక్‌బోర్డులకు చివరికి కాలేజీ క్యాంపస్‌లోని చెట్లకు కూడా మణీంద్ర, చందన ప్రేమికులని తెలిసి పోయింది. కాలేజీలో అధ్యాపకులకు, ప్రిన్సిపాల్‌కు కూడా వీరి ప్రేమ వ్యవహారం తెలిసినా, కాలేజీల్లో ఇది సర్వసాధారణమే అని మిన్న కుండిపోయారు. కొంతమంది స్టూడెంట్స్ మణీంద్ర చందనల ప్రేమ షాజహాన్ ముంతాజ్‌ల ప్రేమ వంటిదే అని అభిప్రాయపడ్డారు. మరి కొంతమంది స్టూడెంట్స్ వారి ప్రేమ ఎంత వరకూ సక్సెస్ అవుతుందో ఏమో! అని అభిప్రాయాన్ని వ్యక్తం చేసారు. కాని చందన స్నేహితురాలు సీతకి మాత్రం వీరి ప్రేమ వ్యవహారంపై అస్సలు నమ్మకంలేదు. చందన ప్రేమ నిజమైనదేగాని, మణీంద్రమాత్రం ఎంత వరకు తనమాటపై నిలబడతాడోనని ఆమెకు అనుమానం. మగవారిని అంత తేలికగా నమ్మేమనస్తత్వం సీతలో లేదు. ప్రేమలన్నీ విఫలమవడానికి కేవలం మగ వారే కారణమని ఆమె విశ్వాసం

మరోరెండు రోజులైనా చందన కాలేజీకి రాకపోవడంతో మణీంద్ర చాలా నిరాశకు లోనయ్యాడు. "సీతకు కూడా చెప్పిచూసాను. అయినా ఆమె ఏ విషయమూ నాతో చెప్పలేదు. నాలుగు రోజులుగా చందనను చూడకపోవడంతో మనసు నిర్వీర్యంగా నిస్తేజంగా తయారైంది."

మనసులోనే అనుకున్నాడు మణీంద్ర.

ఇంతలో సీత లైబ్రరీవైపు వెళుతూ కన్పించింది. వడివడిగా ఆమెవైపు అడుగులు వేసాడు మణీంద్ర

"సీతా! చందన విషయం ఏమైనా తెలిసిందా?" ఆత్రుతగా అడిగాడు మణీంద్ర

మౌనంగా ఉండిపోయింది సీత.

"సీతా ఏమిటి? చెప్పు చందన కాలేజీకి రావట్లేదే?" మరింత ఆత్రుతగా అడిగాడు మణీంద్ర

మౌనంగానే ఉండిపోయింది సీత

"సీతా! ప్లీజ్ నీ మౌనం చూస్తూ ఉంటే నాకు చాలాభయంగా ఉంది విషయం ఏమిటో చెప్పు" బ్రతిమాలాడు మణీంద్ర

"చందన ఆరోగ్యం బావుండలేదు. అందుకే కాలేజీకి రావట్లేదు" విచారంగా చెప్పింది సీత

"ఆరోగ్యం బావుండలేదా? అంటే ఏమైంది?" కంగారుగా అడిగాడు మణీంద్ర

"నాలుగురోజుల క్రితం చందన కళ్లు తిరిగి క్రింద పడిపోయిందట డాక్టర్ దగ్గరకు తీసుకెళితే అన్ని టెస్టులూ చేసి హార్ట్‌ప్రాబ్లమ్ అని చెప్పారట మరోరెండు సంవత్సరాల కంటే ఎక్కువకాలం బ్రతకదని కూడా తేల్చిచెప్పారట" విచారంగా చెప్పింది సీత

సీత చెప్పిన వార్తవిని మణీంద్ర మౌనంగా ఉండిపోయాడు. తలదించుకొని కాసేపు అలాగే ఉండి ఒక నిర్ణయానికి వచ్చినవాడిలా నెమ్మదిగా అక్కడి నుండి వెళ్లిపోయాడు మణీంద్ర

- - -

మణీంద్ర అలా మౌనంగా వెళ్లిపోవడంలో అర్థం ఏమిటో! బహుశా చందనపై తన నిర్ణయం మార్చు కుంటాడేమో! పెళ్లంటే నూరేళ్ళ జీవితం. రెండేళ్ళలో చనిపోయే చందనని పెళ్ళి చేసుకోవడానికి మణీంద్ర ఎట్టి పరిస్థితులలోను ఒప్పుకోడు. చందనపైనుండి తన మనసు మరల్చుకుంటాడేమో! తన మాటలు విని కూడా ఏమీ సమాధానం చెప్పకుండానే మౌనంగా వెళ్ళిపోయాడు. తన ఉద్దేశ్యం ప్రకారం మణీంద్ర తప్పకుండా చందనని మర్చిపోయి, తన దారి తను చూసుకుంటాడు" మనసులోనే అనుకుంటూ లైబ్రరీలోకి వెళ్లింది సీత

మరో నాలుగురోజులు మణీంద్ర కూడా కాలేజీకి రాలేదు. బయట ఎక్కడయినా మణీంద్ర కన్పిస్తాడేమోనని ఎదురుచూసింది సీత. కానీ ఎక్కడా అతని జాడలేదు.

"తన అనుమానం నిజమయింది. మణీంద్ర తన దారి తను చూసుకొనే ప్రయత్నంలో ఉండిఉంటాడు. చందన అటువంటి పరిస్థితులలో ఉందని తెలిసి కూడా అతని అభిప్రాయాన్ని కనీసం వ్యక్తం చేయకుండా వెళ్లిపోయాడు. మౌనంగా వెళ్లిపోయిన వ్యక్తి తరువాత రోజైనా వచ్చి చందనకు ఏదైనా సందేశాన్ని పంపవచ్చుగదా! లేక తనే వెళ్లి చందనను ఓదార్చవచ్చు గదా! తను ఏ నిర్ణయం తీసుకో దలిచాడో కనీసం తనతోనైనా చెప్పవచ్చుగదా" మనసులోనే బాధపడుతోంది సీత.

- - -

అదేరోజు సీత చందన దగ్గరకు వెళ్లింది. సీతను చూచి చందన ఆత్రుతగా దగ్గరకు పిలిచింది.

"సీతా! మణీంద్ర కన్పించాడా? ప్రాబ్లమ్ అతనికి చెప్పావా? అతను ఎలా స్పందించాడు?" ఆత్రుతగా అడిగింది చందన

"విషయమంతాచెప్పాను. అంతావిని అతను మౌనంగా ఉండిపోయాడు. అతని అభిప్రాయం ఏమీ చెప్పలేదు. కాసేపు అలాగే నిలబడి మౌనంగా నడుచుకుంటూ వెళ్లిపోయాడు" అంది సీత

"అంటే అతని అభిప్రాయమేమిటంటావ్?" అంది చందన

"నీ పిచ్చిగాని, అతనికి నీపైగల ప్రేమ పవిత్ర మైనదికాదు. అదికల్మషమైనది. నిజమైన ప్రేమ అన్ని ఒడిదుడుకులకు తట్టుకుంటుంది నిజమైన బంగారం అగ్నిలో వేసినా మెరుస్తూనే ఉంటుంది. ఎన్ని సమస్యలెదురైనా తట్టుకొని నిలబడగలిగేదే అసలైన ప్రేమ. ఇప్పటికైనా అతని నైజం నువ్వు గ్రహించ గలగాలి. అతను అనేకాదు అసలు మగవాళ్ళందరూ అంతే. స్త్రీలో ఏదో ఒక అర్హత చూసి ప్రేమిస్తారు. ఏ అర్హతలేని వాళ్ళని అసలు జీవించే అర్హతకూడా

లేని స్త్రీని ఎవరు ప్రేమిస్తారు? ఎందుకు పెళ్లిచేసుకుంటారు?" ఖచ్చితంగా అందిసీత.

"సీత నువ్వెన్నయినా చెప్పు మణీంద్ర అటువంటి వ్యక్తికాదు. నాకు అతనిపై నమ్మకముంది. అతని మనస్తత్వం నాకు పూర్తిగాతెలుసు. అతని మనసుని దోచుకున్ననేను ఆ మాత్రం గ్రహించలేనా? నీ అభిప్రాయంతో నేను ఏకీభవించను" అంది చందన "నీఖర్మ! నిన్ను ఎవరూ బాగుచెయ్యలేరు. పూర్తిగా మోసపోయిన తర్వాత అంటే చేతులు కాలిన తర్వాత ఏమి చేసినా ఫలితముండదు. రోగ మొచ్చినతర్వాత బాధపడే కంటే ఏరోగము రాకుండా జాగ్రత్త పడితే మంచిదని నా అభిప్రాయం'' అంటూ అక్కడ నుండి వెళ్లిపోయింది సీత.

సీత వెళ్లినవైపే చూస్తూ తనను తానే ప్రశ్నించుకో సాగింది చందన.

"మణీంద్ర నిజంగా ఎటువంటివాడు? అతని ప్రేమలో కల్మషముందా? చాలా మంది మగవాళ్ల లానే తనలో ఏదో అర్హతచూసి ప్రేమించాడా? తను రెండు సంవత్సరాల కంటే ఎక్కువకాలం బ్రతకనని తెలిసి ఎలా ఫీలయ్యాడో! మౌనంగా ఉంటే అతని భాష ఎలా అర్థమవుతుంది? అతని మౌనానికి అర్థం ఏమిటి? ఇప్పుడు తను ఏమిటి చెయ్యడం?"అంటూ మధనపడసాగింది చందన.

- - -

మరోరెండురోజుల తర్వాత కాలేజీకి వచ్చాడు మణీంద్ర. అతని ముఖంలో ఫీలింగ్స్ ఏమాత్రం అర్థం కాలేదు సీతకు. అతనిని ఏవిధంగా గెస్ చెయ్యాలో అర్థం కాలేదు సీతకు. "బహుశా చందన ప్రస్తావన ఏమీ తీసుకురాకుండా అలా మౌనంగా ఉండి పోతాడేమో" అనుకుంది సీత.

కాలేజీ ఐపోయిన తర్వాత వడివడిగా అడుగులు వేసుకుంటూ సీత దగ్గర కొచ్చాడు మణీంద్ర. సీత మణీంద్ర వైపు అర్థం కానట్లుగా చూసింది.

" సీతా! నేను చందనతో ఒకసారి మాట్లాడాలి" అన్నాడు మణీంద్ర

"ఇప్పుడెలా? తనుచాలా నీర్సంగా ఉంది. బయటికి రావడానికి వాళ్లింట్లో ఇష్టపడతారోలేదో" అందిసీత

"ప్లీజ్ సీతా! సాయంకాలం నువ్వు దగ్గరుండి చందనను ఒకసారి పార్కుకుతీసుకురా ప్లీజ్" అన్నాడు మణీంద్ర

"సరే అలానే తీసుకువస్తాను" అందిసీత

"థ్యాంక్స్" అంటూ వెళ్లిపోయాడు మణీంద్ర.

"ఏమిటితను? చందనతో ఏం మాట్లాడుతాడు? విషయం తెలిసి వారం కావస్తున్నా, మౌనంగా ఉండి ఇప్పుడేం మాట్లాడుతాడో" అనుకుంది సీత

ఆ రోజు సాయంకాలం చందనను వెంటబెట్టు కొని పార్కుకి వచ్చిందిసీత. అప్పటికే అక్కడ కూర్చొని ఉన్నాడు మణీంద్ర. సీత, చందన వెళ్లి మణీంద్ర దగ్గరగా కూర్చున్నారు. మణీంద్ర చందనవైపు కాసేపు అలానే తదేకంగా చూసాడు.

"చందనా! ఎలా ఉన్నావు?" అన్నాడు ఆప్యాయంగా మౌనంగా ఉండిపోయింది చందన

"చెప్పు చందనా! ఇప్పుడెలా ఉంది?" అన్నాడు మణీంద్ర

"సీత చెప్పిందటకదా" అంది చందన

"అవును. సీత విషయమంతా చెప్పింది. సీత చెప్పినమాటలకు నామెదడు మొద్దుబారిపోయి, మౌనంగా ఉండిపోయాను. వారంరోజులు నా మనసు మనసులో లేదు. రకరకాల ఆలోచనలతో మనసంతా అస్తవ్యస్తంగా తయారైంది....." అంటూ ఒక్కక్షణం ఆగాడు మణీంద్ర

"చందన, సీత, మణీంద్ర ఏమి చెబుతాడోనని అతనివైపే చూడసాగారు

"చందనా! మనంవీలైనంత త్వరగా పెళ్లి చేసుకోవాలి'' అన్నాడు మణీంద్ర చందన ముఖంలోకి చూస్తూ

చందన మనసు పురివిప్పి నాట్యం చేసింది. సీత షాక్ తిన్నట్లుగా చూస్తుండిపోయింది.

"నాతో జీవితం కొన్నిరోజులే అని తెలిసీ......" అంటూ ఆగింది చందన.

''కొన్నిరోజులు కాదు కొన్ని క్షణాలైనా చాలునాకు. జీవితం క్షణికం.ప్రేమ శాశ్వతం.

క్షణికమైన జీవితంకోసం శాశ్వతమైన ప్రేమను వదులుకోలేను. నీతో కొన్ని క్షణాలు జీవితాన్ని పంచుకున్నా అది నాశేషజీవితానికి స్ఫూర్తిదాయకంగా ఉంది. నువ్వు జీవించేది కొన్ని రోజులే అని తెలిసి వేరే ప్రత్యామ్నాయం చూసుకొనే మూర్ఖుణ్ణికాదు నేను ఒకసారి తెల్లకాగితం వంటి నా మనసుపై నీ ప్రేమ ముద్రపడిన తర్వాత అదినా జీవితమంతా చెరిగిపోదు. నువ్వు ఎన్నిరోజులు నాతో జీవితాన్ని పంచుకుంటావు? అనేది ముఖ్యంకాదు. నీ ప్రేమను నేను పూర్తిగా పొందగలిగానా? లేదా? అన్నదిముఖ్యం" అన్నాడు మణీంద్ర.

మణీంద్ర మాటలనుండి జాలువారుతున్న ప్రేమామృతాన్ని మనస్ఫూర్తిగా ఆస్వాదిస్తోంది చందన.

సీత మణీంద్ర వైపు కనురెప్పవాల్చకుండా అలానే చూస్తోంది. ఆమె మనసులో ఉన్న భావాలకు మణీంద్ర మనస్తత్వానికీ ఎక్కడా పొంతన కుదరక అయోమయంలో పడింది. మగవారిపై అమెకున్న అపోహలన్నీ మంచులా కరిగిపోసాగాయి.

"అదికాదు మణీంద్రా! నాకు హార్ట్ ప్రాబ్లమ్ అని తెలిసి కూడా నువ్వీ నిర్ణయం ఎందుకు తీసుకున్నట్లు?" ప్రశ్నించింది చందన

"ప్రాబ్లమ్ నీ హార్టుకే గానీ నీ మనసుకులేదుకదా. నీ మనసే నాస్వంతమైనపుడు నీహార్ట్ ప్రాబ్లమ్ నన్నేం చేయ్యలేదు. పవిత్రమైన ఆ మనసుని నువ్వుదోచు కున్నావు. ఇప్పుడు నిన్ను కాదని వేరొకరికి నా మనసు అర్పించలేను. చందనా! మనం వీలైనంత త్వరగా పెళ్లిచేసుకుంటే నా సాన్నిహిత్యంలో నీ ఆరోగ్యాన్ని పదిలంగా చూసుకుంటాను. నీ ఆరోగ్య సమస్య పూర్తిగా నా మీద వదిలివేసి నువ్వు నిశ్చిం తగా ఉండుచందనా!" ఆవేశంగా అన్నాడు మణీంద్ర.

సీత ఇక తట్టుకోలేకపోయింది. ఆమె మనసులో ఉన్న అనుమానాలూ అపోహలూ చాలావరకు తొలిగిపోయాయి.

"మణీంద్ర! అయామ్‌సారీ! దీనికంతటికీ కారణం నేనే నామనసులోని అనుమానాలూ, అపోహలూ, ఈ సమస్యకంతటికీ కారణం అయ్యాయి. నిజానికి చందనకి ఏ ప్రాబ్లమూలేదు. చందన పూర్తి ఆరోగ్యంగాఉంది. నీ ప్రేమకు నేనే పరీక్ష పెట్టాను. మీరు అపురూపమైన ప్రేమికులని తెలిసి కూడా అదెంత వరకూ నిలబడుతుందో పరీక్షించాలనుకున్నాను. మగవాడిగా నీ ప్రేమ ఎంత నిష్కల్మషమైనదో చూడాలనుకన్నాను. చందన నీపై ఎంతో నమ్మంకంగా ఉంది. అయినప్పటికీ నీకే పరీక్ష పెట్టడానికి చందన ఒప్పుకొని నాతో సహక రించింది. ఎవరో కొందరు మగవారు ప్రేమించి మోసం చేసే వారున్నప్పటికీ, మగవాళ్లందరూ అటువంటి వారు కాదని నువ్వు నిరూపించు కున్నావు. సమాజంలో నీలాంటి మనసున్న వాళ్లు కూడా ఉంటారు. ఎవరో కొందరు దుర్మార్గు లున్నారని మగవారందరినీ ఒకేకోవలో జమ చేయడం మూర్ఖత్వమని తెలుసుకున్నాను. నన్ను మీ ఇద్దరూ క్షమించాలి" అంది సీత.

సీత మాటలకు మొదట ఆనందమూ ఆతర్వాత ఆశ్చర్యమూ కలిగింది మణీంద్రలో. "బంగారాన్నైనా పరీక్షించేటప్పుడు కొలిమిలో కొంతసేపు పెట్టక తప్పదు." అనుకున్నాడు. పరీక్షలో పాసై గోల్డ్ మెడల్ సంపాదించిన వ్యక్తిలా తనను తాను ఊహించు కున్నాడు మణీంద్ర. సీతవైపు ఆశ్చర్యంగా చూసాడు మణీంద్ర.

"నన్ను క్షమించాలి. మణీంద్రా నువ్వే గెలిచావు అంది సీత. క్షమించడానికి నువ్వేమీ తప్పు చెయ్యలేదు సీతా! కేవలం ఒక పరీక్ష పెట్టావు. అదీ, నేను పాసయ్యే పరీక్ష పెట్టావు. చాలా థ్యాంక్స్" అంటూ,

"ఈ హార్ట్‌పేషంట్‌ని పైకి లేపాలిగా" అంటూతన చేతిని చందనకందించాడు మణీంద్ర. ★